

కాఫీ పరిమళాల మీదుగా నిద్రలేచి...





ఒంటరి ఆకాశం, మబ్బులన్నీ ముసిరి, వానను ఊరిస్తూ మనోహరమైన ఉదయాన్ని వాగ్దానం చేసిన రోజున, సుందరం అదృశ్యం గురించిన కబురు తెలిసింది.

2

ఒక కాఫీ పరిమళం కోసం ఉదయాలన్నీ వెతుకుతాను. కానీ ఇవి ఆనాటి ఉదయాలు కావు. కాఫీ పరిమళం, న్యూస్ పేపరు విరజిమ్మే వార్తలు, వెచ్చని సూర్యకిరణం, దిండు కింద గుబాళించే కల, మధురమైన ఆమె నవ్వు (ఆమె నవ్వటం మానేసి చాలారోజులైంది), ఇప్పుడేదీ లేదు. నగరం నిద్ర లేచే సమయానికి వర్షం మొదలైంది. కిటికీలోంచి చెట్లు ఊగుతున్న దృశ్యం. లేత ఎరుపురంగు ఆకాశం, క్రమంగా నల్లబారి, తపతపమంటూ వర్షం. రేడియోలో ప్రాంతీయ వార్తలు. మధ్యలో సమయం ఆరుగంటల నలభై అయిదు నిమిషా లని ప్రకటన. కిటికీలోంచి, వానలోంచి చూపు సారిస్తే, ఆరుగంటల యాభై నిమిషాలకు ఎప్పటిలాగే ఆ అమ్మాయి. ప్రతిరోజూ ఆ సమయానికి వేగంగా నడుచుకొంటూ 'గడియారపు పిట్ట' అని ఆ అమ్మాయిని పిలిచేవాడు సుందరం. ఇవాళ కూడా ఆ అమ్మాయి సరిగ్గా అదే సమయానికి పైన గొడుగు, చీర కుచ్చిళ్ళను ఎగదోపుకొని, నీళ్ళను ఈదుతూ వెళ్ళిపోయింది. దూరప్రాంతంలో ఎక్కడో ఉద్యోగం లేదా సంకేత స్థలంలో ఎదురుచూసే ప్రియుడు లేదా కాలాన్ని దైవంగా భావించే ఒక కార్యకర్త లేదా, లేదా రకరకాల ఊహాగానాలు చేసేవాడు సుందరం. ప్రతిరోజూ అదే సమయానికి ఆ అమ్మాయిని రోడ్డుపైన చూడడం ఎంతో ఇష్టం సుందరానికి. ఆ అమ్మాయిని చూడటం కోసం, ఉదయం ఆరుగంటల యాభై నిమిషాల కోసం చాలా రాత్రులు మా యింట్లోనే గడిపేవాడు. కిటికీలోంచి ఆ అమ్మాయికి చెయ్యి ఊపుతూ ఆ అమ్మాయి సన్నని నవ్వుని ఎంజాయ్ చేస్తూ - వాన క్రమంగా పెద్దదయింది. వానాకాలం తన తొలి వర్షంతో పలకరిస్తుంది. ప్రచండమైన వాన. తెరిపి లేకుండా కురు స్తుంది. గోడలు, తలుపులు, దూరంగా ఉన్న రోడ్డు, వరుసగా పేర్చబడ్డ ఇళ్ళు, సమస్తమూ నీటిధారల మధ్యన వేలాడుతూ వాన అనే థ్రిల్ తెలుస్తుంది. భగవంతుడు మళ్ళీ బ్రతికి వచ్చినట్లు. వాన సుందరానికి ప్రియమైన విషయం. 'వానలో తడుద్దాం. మళ్ళీ మొలకెత్తుదాం!' అంటూ వానలోకి లాక్కు వెళ్ళేవాడు. వానాకాలంలో అతను రాసే కాలమ్ (సుందర కాలమ్ పేరుతో ప్రతి శనివారం వస్తుంది) ఒక అద్భుతం. గొప్ప కవితాత్మకమైన ప్రోజ్ అతనిది. ఇవాళ శనివారం, ఇవాళా సుందర కాలం

రాలేదు. వరుసగా మూడోవారం. ఏమైంది సుందరానికి. అని వాకబు చేస్తే ఏమో ఏమో అనే సమాధానంలోంచి సుందరం అదృశ్యం గురించిన కబురు తెలిసింది. ముందుగా అతని మాజీ ప్రియురాలు మోహినిని అడిగాను. ఎప్పటిలాగే ఆమె కళ్ళలో మౌనం. న్యూ థియేటర్ కుర్రవాళ్ళ నడిగాను. రెండు వారాలయింది చూసి అన్నారు. మేక్‌బెత్ తెలుగు అనువాదం పూర్తి చేసి ఇవ్వాల్సి ఉంది అని కూడా అన్నారు.

దేశి అనే కవి సుందరం గురించి కొన్ని సంగతులు చెప్పాడు. "నాలుగు వారాల క్రితం సిమెట్రీ దగ్గర అతన్ని చూశాను. అమ్మ సమాధి కోసం కొంచెం స్థలం రిజర్వు చేయాలని వచ్చానన్నాడు. ఆశ్చర్యంగా చూస్తుంటే 'అది కాదు, అమ్మ ఆరోగ్యం గురించి నీకు తెలుసుకదా. జ్ఞాసకాలన్నీ చచ్చిపోయాయి. శరీరం కూడా క్షీణించి, పోగులు పోగులుగా విడిపోతూ, క్రమంగా ఏదో ఒక రోజు ఆమె మరణంగా మిగిలిపోవచ్చు. అమ్మ శవాన్ని నెత్తిన పెట్టుకొని మళ్ళీ మా పల్లెటూరుదాకా వెళ్ళలేను. అందుకే...' అని సంజాయిషీలా చెప్పేడు సుందరం" అని దేశి కథనం. అతను చెప్పిన దాని ప్రకారం ఆ స్థలం కూడా దొరకలేదు. జాగా లేదు. చనిపోనివ్వండి. అంతకు అవసరమైతే ఏదో ఒక సమాధిని పక్కకు జరిపి - అన్నాడట వాడు దాంతో వాడితో గొడవ పెట్టుకొన్నాడట సుందరం. మామూలుగా అనిపించే సుందరం అదృశ్యం గురించిన కబురు క్రమంగా గుబులు రేపే విషయంగా మారింది. వాన ఇప్పుడు సుందరాన్ని గుర్తు చేస్తుంది. ముఖ్యంగా హామ్లెట్ నాటకం. చివరి దృశ్యం, కత్తి పదును, చిమ్మిన రక్తం, థియేటర్‌ని మెస్మరైజ్ చేసిన సుందరం. వాన ఇప్పుడు మరణిస్తున్న మనిషి పెనుకేకలా ఉంది.

### 3

సిటీ మనల్ని ఎప్పుడూ ఆశ్చర్య పెడుతూనే ఉంటుంది. ఇంత వానలోనూ సిటీబస్‌లోని సీట్లన్నీ నిండిపోయి ఉన్నాయి. అప్పుడే పదయింది. ఇక్కడ కాలం ఒక నమ్మకద్రోహం లాంటిది. ఆకుపచ్చ రెయిన్‌కోటుతో ఒళ్ళంతా కప్పుకొని, గేటు దగ్గర వేళ్ళాడుతూ, వాన యింకా వెంటాడుతూనే ఉంది. బస్సు లోపల గంభీరమైన వాతావరణం. ఎప్పుడూ కనబడే అరుపులు, కేకలు లేవు. కూర్చున్నవాళ్ళు గొప్ప ధ్యానంలో ఉన్నవాళ్ళలా, వాళ్ళలో చాలామంది చేతుల్లో ఎపేస్ ఆఫ్ టెర్రిజం అనే బిన్‌లాడెన్‌పై పుస్తకం వుంది. పరీక్షకు చదువుతున్నంత శ్రద్ధగా. బస్సు మధ్యలో గడియారపు పిట్ట అనే అమ్మాయి కనబడింది. నాలో ఉత్సాహం. జనాన్ని తోసుకొంటూ ఆ అమ్మాయివైపు వెళ్ళాను. ఆ అమ్మాయి చేతిలోనూ పుస్తకం అయితే అది బిన్‌లాడెన్ గురించినది కాదు. ఏదో కవిత్వం. సుందరం ఈ సమయంలో ఉంటే పెద్దగా ఉద్రేకపడి, బహుశా ఆ అమ్మాయిని పలకరించి, కబుర్లు చెప్పి, అయ్యో సుందరం లేడే అని మళ్ళీ దిగులు.

## 4

సుందరం చనిపోయి ఉంటే, హఠాత్తుగా ఒక ఉలికిపాటు. బహుశా చనిపోయే ఉంటాడు. తనకిష్టమైన షేక్స్‌పియర్ నాటకాల పాత్రలాగే, ముఖ్యం గా హామ్లెట్‌లాగా. ఊహు! చనిపోయి ఉండడు. ఏదోరోజు అతను తిరిగి ప్రత్యక్ష మవుతాడు. బహుశా ఒక ఉదయంపూట అతను ఆఫీసులో తనకిష్టమైన కిటికీ పక్క సీట్లో కూర్చుని, సన్నని నవ్వు ముఖంతో, సిగరెట్టు పొగ, టీ వాసనల మధ్య తను కొత్తగా ఆ వారం రాసిన కాలమ్ చదివి వినిపిస్తూ లేదా యుద్ధం చేస్తున్నంత తీవ్రతతో ఎవరితోనో వాదిస్తూ ఎదురుకావచ్చు. అతని అదృశ్యం గురించి మేం పడిన ఆందోళన వింటూ, నవ్వుకొంటూనో లేదా విసుక్కొంటూనో.

## 5

రోడ్డుపై నీళ్ళు, నీళ్ళను చీల్చుకొంటూ సిటీబస్. కూర్చోవడానికి సీటు దొరికింది. అదీ గడియారపు పిట్ట అనే అమ్మాయి వెనకసీట్లో. ఆ అమ్మాయి దీక్షగా చదువుతుంది కవిత్వం. బహుశా హైకూలు కావచ్చు. హలో అన్నాను. ముఖాన్ని వెనక్కు తిప్పి, నిలువుగా సాగదీసి, సన్నగా నవ్వి, మళ్ళీ ముందుకు తిరిగింది. పొద్దున్నే గడియారపు ముల్లు అంత ఖచ్చితంగా ఎక్కడికి వెళుతుం టారు? అన్నాను. కాసేపు ఆశ్చర్యంగా నావైపు చూసి, తల పక్కకు తిప్పుకొని నిముషం తరువాత, పుస్తకం మూసేసి నావైపు తిరిగి కళ్ళు అటూ యిటూ తిప్పుతూ, స్కూల్లో టీచరు ముందు పాఠం అప్పజెబుతున్నట్లుగా "పొద్దున్నే ఓల్డ్ ఏజ్‌హోంకి వెళతాను. పదిగంటల దాకా వాళ్ళకు ఆయాగా. ఇదుగో ఇక ఇప్పటి నుంచి ఎర్రగడ్డ ఎసైలమ్‌కి వెళతాను. రాత్రికి నిర్మల హృదయం వాళ్ళ మెంటల్ రిటార్టెడ్ పిల్లలహోమ్‌లో గడుపుతాను అంది ఎంతో సీరియస్‌గా. "ఒక్క శనివారం మాత్రం ఎక్కడికీ వెళ్ళను. ఆరోజు సైకియాట్రిస్ట్ డా॥ రమణ క్లినిక్‌కి వెళతాను. ఆయనకు నేను కవిత్వం రాసి చూపించాలి. వారమంతా ఏం చేశానో వివరంగా చెప్పాలి" ఆ రెండు మాటలూ గడగడా చెప్పి మళ్ళీ పుస్తకం చదువుకోవటం మొదలుపెట్టింది. ఎందుకో మళ్ళీ ఆమెను కదిలించా లనిపించలేదు. వాన కురుస్తూనే ఉంది. ఆ అమ్మాయి పెద్దగా గొణుక్కొంటూ పుస్తకాన్ని చదువుతుంది. వీధులిక నీ ప్రియమైన వాళ్ళను గుర్తు చెయ్యవు. ఆ అమ్మాయి గొంతులోంచి ఒకటి రెండు పదాలు జారిపడుతున్నాయి. ప్రవక్తల గొంతులా ఏ ఉద్రేకాలూ లేని స్వరం.

## 6

నిన్న పదిగంటలకు ఆఫీస్‌లో ఎస్‌ఒఎస్ మీటింగ్. ఎడిటర్, అందరు సబ్‌లు, కార్టూనిస్ట్, నలుగురైదుగురు రచయితలు, కాలమిస్ట్‌లు ఉన్నారు.

సుందరం అదృశ్యం గురించి చర్చ. ఇల్లు తాళం వేసి ఉంది. చాలా యేళ్ళుగా తెరవని ఇల్లులా దుమ్ముపట్టి ఉంది అన్నాడు సినిమా పేజీ చూసే సబ్. "సుందరం గురించి నాకు తెలియాలి సాయంకాలానికి, కనీసం రేపటికి" ఎడిటర్ విసుక్కొన్నాడు. ఆయనకు చాలా కోపంగా ఉంది. "ఇదేమిటిది. అరణ్యమా? నగరమా? ఒక జర్నలిస్టు కనబడకపోతే ఎవరికీ పట్టదు. మూడు వారాల తరువాత తాపీగా కనబడలేదని చెబుతారా?" పెద్దగా అరిచేడు. రకరకాల ఊహాగానాలు, కామెంట్ల మధ్య మీటింగ్ ముగిసింది. పోలీస్‌స్టేషన్, హాస్పటల్, మిత్రుల ఇళ్ళు, సాహిత్యపు వర్క్‌షాపులు, బార్‌లు, తలో వైపుకు వెళ్ళవలసిందిగా ఆదేశించాడు ఎడిటర్.

## 7

వాన తగ్గిపోయింది గాని, మబ్బులు మాత్రం మరో పెద్ద జల్లును ప్రామిస్ చేస్తున్నాయి. బస్సులో క్రమంగా శబ్దాలు మొదలైనాయి. వంద నోళ్ళు, వేల పదాలు, శబ్దాలు ఆ పదాలన్నీ గుట్టలు గుట్టలుగా పోగయి ఊపిరాడనట్లుగా ఉంది. ఆ గొడవ మధ్యన గడియారపు పిట్ట అనే అమ్మాయి గొంతు కూడా. "అతన్ని అర్థం చేసుకోండి! అతని గాయం లోతైంది!" కవిత్వం కాబోలు నేరుగా చెవుల్లోకి ప్రవేశిస్తుంది. కళ్ళు మూసుకొంటే, ఆ కవిత్వం ఒక దృశ్యంలా. మహానగరం విశాలమైన చౌరస్తా, వందల జనం, అటెన్షన్‌లో నిలబడ్డట్టు వేదికపై ఒకే ఒక వక్త. గడియారపు పిట్ట అనే అమ్మాయి, శ్రావ్యంగా కవిత్వం చదువుతూ, యుద్ధంలోలాగా, గాయాలు గాయాలుగా ఆ అమ్మాయి కవిత్వ పఠనం కొనసాగుతూనే ఉంది. మధ్యాహ్నమైంది. కొద్దిగా ఎండపొడ. సుందరం గుర్తుకొచ్చాడు. సుందరం ఈ రోడ్డు మధ్యన ఎక్కడో పుట్టుకొస్తాడు. జనం మధ్యలోంచి హఠాత్తుగా సుందరం రూపం తళుక్కుమంటున్నదేమోననే ఆశ. సుందరం పదేపదే తటస్థపడే కాందిశీకుడు. బస్సు కిటకిటలాడుతుంది. బరువుగా కదులుతున్న బస్సు రోడ్డు మధ్యన హఠాత్తుగా ఆగిపోయింది. కంగారు, భయం, అరుపులు, తొక్కిసలాట ఏమైంది? ఎవరో అరుస్తున్నారు. దొమ్మి పోలీసుకాల్పులు, ఎన్‌కౌంటర్, బహుశా ఏదో ఒక పాత దృశ్యమే అయ్యుంటుంది. గౌలిగూడ బస్టాండ్‌లో బాంబు పేలిందట. ఎవరో అరిచారు. జనం బస్సు దిగి, అటూ ఇటూ పరిగెత్తుతూ. బాంబు అంటూ అరుస్తున్న ముఖాలు, భయాన్ని సూచించే కళ్ళు, బస్సులన్నీ ఆపివేశారు. ట్రాఫిక్ ఆగిపోయింది. గడియారపు పిట్ట అనే అమ్మాయి పేరింకా కనుక్కోలేదు. అనీజీగా ముఖం పెట్టి కవిత్వం పుస్తకాన్ని పర్సులో దాచేసుకొని జన ప్రవాహంలోకి జొరబడింది.

## 8

వాదించటం సుందరానికి ఇష్టం. అతని వాదం ఒక ప్రణాళికలా ఉంటుంది. ముందు రీజనింగ్‌తో మొదలుపెడతాడు. అది క్రమంగా గాఢమైన

ఉద్వేగభరితమైన ప్రకటనలా మారుతుంది. అప్పటికీ అతని వాదన హేతు బద్ధంగా తోస్తుంది. క్రమంగా అతని వాదన తీవ్రమైన యుద్ధంలా మారుతుంది. చుట్టూ ఉన్న వాళ్ళందరూ అతని భావాల ముట్టడిలోకి వెళ్ళిపోవటం గమనిస్తాం.

## 9

గుంపులోంచి పక్కకు తొలిగి, దూరంగా ఒక మూలకు వెళ్ళి పాత సిమెంటు విగ్రహం కింద కూలబడ్డాను. ఆ విగ్రహం కవిదో, రాజకీయ నాయకుడిదో తెలియటం లేదు. విగ్రహం భుజంపై కూర్చొని రెండు పిచుకలు కబుర్లు చెప్పుకొంటున్నాయి. బహుశా యుద్ధ సమయాలపై చర్చ చేస్తున్నాయేమో. విగ్రహంపై పగుళ్ళు, నల్లని పూత. జనం ఆ విగ్రహంలోని మనిషిని మర్చిపోయిన సంగతి తెలుస్తూనే ఉంది. పిట్టలకు మాత్రం అదో చర్చాస్థలం అయింది. పిచ్చుకలు, గోరంకలు, పిట్టలు ఇంకా సిటీలో కనబడటం ఆశ్చర్యమే. దూరంగా మసీదు గొంతు. ఎక్కడో మనుష్యుల మధ్య నుంచి గుర్తుపట్టి చెయ్యి ఊపే మిత్రుడూ. ఇదీ ఆశ్చర్యమే.

## 10

నాలుగు వారాల క్రితం అప్పటికి సుందరం అదృశ్యమైన సంగతింకా తెలియదు. అతని గురించిన దుఃఖం శరీరంలోకి చొరబడని స్థితి అది. సుందరం ఇంటివైపు మార్నింగ్ వాక్ వెళ్ళాను. ఇంటి నిండా కవితా సంపుటాలు, కాసెట్లు, అందంగా ఫ్రేమ్ చేయబడ్డ ఎన్నో పెయింటింగ్‌లు, వరండాలోంచి తొంగి చూస్తే కుడివైపు గది. దానిపైన మోహినీ వరణం. మోహిని గురించిన జ్ఞాపకాల స్థలం, అని రాసి ఉన్న బోర్డు. గదిలోని వందలాది ఫొటోల మధ్యన అయిదు అడుగుల ఎత్తు మోహిని ఫొటో సజీవంగా, కలలాంటి ఒక గతాన్ని గుర్తు చేస్తున్నట్లుగా. గదిలో ఒక మూలన బంగారు రంగు అక్షరాలతో ఒక సైన్‌బోర్డు. ఒక స్త్రీ, ఒక పురుషుడు వాళ్ళ ఒకప్పటి స్నేహానికి, ప్రేమకీ గుర్తుగా అని రాసి ఉంది.

ఆ గదికి కాస్త దూరంలో 'అమ్మ గది, అమ్మ నివసించే స్థలం' అని రాసి ఉన్న బోర్డు. దాని కింద అమ్మకు క్రమంగా అన్నీ మర్చిపోయే జబ్బు. మీరెవరో గుర్తుండకపోవచ్చు. మిమ్మల్ని మీరు పరిచయం చేసుకోండి. అని రాసి ఉంది. గది ముందు గుట్టలు గుట్టలుగా ప్లాస్టిక్ వస్తువులు, పక్షులు, జంతువులు, అన్నిటిపైనా పేర్లు రాసి పెట్టి ఉన్నాయి. సింహం, అత్యంత క్రూరమైన జంతువు, వేణువు, మాధుర్యాన్ని స్రవించే వెదురు బొంగు. అట్లా అన్నిటి మీదా బోర్డులున్నాయి. పెరటి నిండా వందలాది పూలమొక్కలు, మొక్కల మొదళ్ళలో చెక్కబోర్డులు తగిలించి, వాటిపై పేర్లు రాసున్నాయి.

## 11

పోలీసు సైరన్లు, కార్ల హడావుడి జనం ఉరుకులు, పరుగులు, వర్షం పడి ఆగిపోయిన ఒక నగరపు మధ్యాహ్నం ఉండీ ఉండీ ఒక పెద్ద ఉరుము. కళ్ళు జిగేలు మనిపించే మెరుపులు. శరీరానికెక్కడో అతుక్కొన్న వాన చుక్క. మధురమైన రోజులు ఎప్పటివో గుర్తొచ్చీ, గుర్తురాక.

## 12

సుందరం గురించిన ఆలోచనలు వెంటాడుతుండగానే, సాయంత్రం గొప్ప దృశ్యంలా ఎదురైంది. ఎర్రని వెలుతురు చిమ్ముతూ ఆకాశం. వందలాది పక్షులు, గుట్టలు గుట్టలుగా ఆకాశమంతా వెదజల్లబడ్డట్టుగా. సిటీలో సుందరం తరుచుగా వెళ్ళే ప్రదేశాలవైపు వెళ్ళాను. చార్మినార్ దగ్గర పురాతనమైన ఇరానీ టీ స్టాల్. వేడివేడి పొగల మధ్యన, ఆ వేల్టి పేపర్లన్నీ అక్కడే చదివేవాడు సుందరం. రాత్రి ఏడు గంటలకు ఆఫీసుకు చేరతాడు. హెడ్‌లైనో, ఎడిటోరియలో హడావుడిగా రాసి కుర్రాళ్ళకిస్తాడు. ఆఫీసులో ఉన్నంతసేపూ ముళ్ళ మీద ఉన్నట్లుగా ఉంటాడు. ఆ కాసేపూ పరమ క్రోధంగా ఉంటాడు. రాత్రి తొమ్మిదికి బయటపడి, ప్రెస్‌క్లబ్ దగ్గర కాసేపు గడుపుతాడు. అక్కడో ముషాయిరా షురు చేస్తాడు. రాత్రి పదికి అతనికిష్టమైన కేమెల్‌బార్‌కు చేరతాడు. బార్‌లో ఓ మూలన అతనికిష్టమైన చోటులో కూర్చొని, సరిగ్గా రాత్రి పదకొండుకు ఒక కవితా సమయం అవుతాడు. ఉర్దూ కవితలో, గద్దర్ పాటలో, బీట్స్, శ్రీశ్రీ, కొత్త కవులో పెద్దగా రిసైట్ చేస్తున్నట్లుగా. ఆ రోడ్లన్నీ తిరిగాను. క్రాస్‌రోడ్స్, ప్రెస్‌క్లబ్, పారడైజ్, కేమెల్ బార్ రాత్రి ఎనిమిది దాకా తిరుగుతూనే ఉన్నాను. ఒక్కొక్క చోటునే పోలికపడుతూ, సుందరంతో ఒక్కో జ్ఞాపకాన్నే కెలుక్కొంటూ, దుఃఖభరితమైన నాస్టాలిజియాగా మారిపోయాను.

## 13

రోడ్ల నిండా జనం మాట్లాడుకొంటూ. అందులో ఎంతో గాసిప్. వర్షం వలన రాత్రి నిండా చల్లటి గాలులు నిండి, కబుర్ల మధ్య అకాలమైన ఈ చలిని గురించే చర్చ. రాజకీయ స్కాములు, టెర్రరిస్టులు, సరిహద్దుల్లో ఉద్రిక్తత – ఇవేవీ కాదు. శరీరాన్ని వణికించే చలి ఇవాల్టి కథ. ఒకానొక డిసెంబరు నెల తీవ్రమైన చలి జ్ఞాపకంగా ఉండిపోతుందని.

ఎక్కడో పెద్దగా నినాదాల శబ్దం. పెద్ద సమూహపు గొంతు కాదు. నలుగురైదుగురు పెద్దగా అరుస్తూ, గ్లోబలైజేషన్ వ్యతిరేకిద్దామని, మల్టీ నేషనల్స్ వెళ్ళిపోవాలని, ప్రైవేటీకరణ వద్దువద్దని – ఒంటరి ప్రతిఘటనలా, వాళ్ళు సరిగ్గా పదిమంది. నినాదం క్రమంగా దగ్గరవుతూ, పక్క నుంచి శరీరాన్ని ఒరుసుకొంటూ – మెల్లగా దూరమైపోతుంది. మధ్యలో హఠాత్తుగా "మనిషిని కాపా

డండి!" అని అరుచుకొంటూ సుందరం ప్రత్యక్షమవుతాడేమో అని, ఒక భ్రమ లాంటి ఆశ కలిగింది. నినాదం ఇప్పుడు దూరమైంది. ఆ కాస్త నినాదం దూరమై నాక మరింక చప్పుళ్ళు లేవు. గాసిప్‌లు లేవు. కథలు లేవు, సినిమా పాటలు లేవు. "పద, నిద్రపోవాల్సిన సమయమైంది" అనుకొంటూ సుందరం జ్ఞాపకాల్ని రోడ్డుపై వదిలేస్తూ బస్‌స్టాప్ వైపు నడిచాను.

## 14

బస్సులో కూర్చొని సుందరం అదృశ్యం అవడానికి కారణాలన్నీ ఆలోచించాను. ప్రత్యేక కారణం ఏదీ కనిపించలేదు. ఉద్యమాలు, ఓడిపోవటాలు, నిరాశల కాలం కాదిది. పోలికలు పట్టలేని ఒకానొక సంక్షోభం. అయితే ఇది స్లో డెత్ మాత్రమే. మనిషిని అదృశ్యం చెయ్యదు. సుందరం ఉద్వేగాన్ని దాచుకోలేడు. ముఖంపైనే అనేస్తాడు. బహుశా ఎంతోమంది అలా గాయపడి ఉంటారు. కులం వర్సెస్ ఉద్యమం, ఉద్యమం వర్సెస్ ఎన్.జి.ఓ. మరియు గ్లోబలైజేషన్ వర్సెస్ ప్రాంతీయ సభలు అనే వ్యాసం పెద్ద సంచలనాన్ని లేపింది. అతనికి బెదిరింపు కాల్స్ కూడా వచ్చాయి.

నెల క్రితం ఒక నిరసన ఊరేగింపులో అతన్ని అరెస్ట్ చేశారు. అందర్నీ రెండోరోజే వదిలేస్తే సుందరాన్ని మరో నాలుగు రోజులుంచారు. పోలీసుల అత్యాచారాలపై, రాజ్యహింసపై అతను రాసిన ఎడిటోరియల్ వ్యాఖ్యల గురించి ఇంటరాగేట్ చేశారని చెప్పారు.

## 15

బస్సు నెక్లెస్ రోడ్డు దగ్గర ఆగింది. ఎదురుగా గ్రేట్ హైదరాబాద్ మాల్, హైదరాబాద్‌కున్న ఏకైక మీటింగ్ ప్లేస్ యిది. సుందరం దీన్ని ఆధునిక రంగస్థలం అంటాడు. అడుగు పెడుతూనే ఒక ఖరీదైన లోకంలోకి వచ్చిన అనుభూతి. మనిషిలో మొత్తంగా ట్రాన్స్‌ఫర్మేషన్ జరుగుతుంది. మాస్క్ ఒకటి ముఖం చుట్టూ మొలుస్తుంది. సుందరం ఈ గ్రేట్ మాల్‌పై పెద్ద వ్యాసమే రాశాడు. సుందరం ప్రకారం మనందరం ఒక కొత్త భాషలోకి, బహుశా దాన్ని కన్సూమర్ భాష అనవచ్చు. దానిలోకి కుదించబడ్డాము. ఇదో వింత భాష. మృదుత్వం, మాధుర్యం, జాలి లాంటి అభౌతిక భావనలు పూర్తిగా తీసివెయ్యబడ్డ భాష. సమస్తమైన మెటాఫర్లను, భావనలను ఈ కన్స్యూమర్ భాషలోకి అనువదించి –

గ్రేట్‌మాల్‌కు బయట రోడ్డుపై ఫోటోఫ్రేములు అమ్ముకొనేవాడి చుట్టూ గుంపులుగా జనం. వాళ్ళందరూ చాలాసేపటి నుంచి తపస్సులో వున్నవాళ్ళలా, అక్కడ ఒక ఫోటోను దీక్షగా చూస్తూ. ఇంత దూరం నుంచి స్పష్టంగా కనిపిస్తుంది

ఆ ఫోటో. మనిషి ఎత్తు ఫోటో అది. ఒక మగవాడు, ఒక ఆడమనిషి. పల్లెటూరు, దూరంగా ఎక్కడో వాగు. వాగులో బట్టలు ఉతుక్కొనే ఆడవాళ్ళు. వాగుకు అల్లంతదూరంలో పశువుల మందలు. మగవాడితో మాట్లాడుతూ ఏడేళ్ళ కుర్రవాడు తలకు గుడ్డ చుట్టుకొని, ఒంటిపై చొక్కా కూడా లేదు. చేతిలోని కర్రను ఎటువైపో చూపిస్తూ ఏదో అద్భుతాన్ని చూపిస్తున్న వాడిలా ఆ కుర్రవాడు. ఆడమనిషి వాగునీళ్ళలో కాళ్ళు తడుపుకొంటూ, ఫోటోలోని దృశ్యం నిజంలాగా, ఇప్పటిలాగా - ఫోటోలోని ఆడమనిషి మనోహరంగా ఉంది. కళ్ళనిండా వెలుగు, వజ్రాల పొడి వెదజల్లినట్లుగా. ఆమె జుట్టు జలపాతంలా గాలిలో ఊగుతూ ఆ ఫోటోను చూస్తున్న జనం, క్రమంగా ఫ్రేమ్‌లోని దృశ్యంలోకి వెళ్ళి అక్కడే జీవిస్తున్నవాళ్ళలా ఉన్నారు. ఆశ్చర్యం! ఇక్కడ నుంచి చూస్తే ఆ ఫోటోలో ఉన్న మగవాడు, ఆడమనిషి సుందరం, అతని ప్రియురాలు మోహినిలా కనిపించసాగారు నాకు.

## 16

బాక్ టు హోమ్! ఇంటి చుట్టూ తెల్లని ముసుగులా మంచు. తలుపుల్ని తోసుకొని లోపలికి వచ్చి, ఒంటరి ప్రపంచాన్ని, మంచంపై పరుచుకొని, స్వెట్టరు, మఫ్లర్, చుట్టుకొని, ఆమె, పిల్లలు అప్పటికే నిద్రపోయారు. చిరిగిన స్వెట్టరులోంచి సన్నని దారపుపోగులు అట్లా మంచంపై వేళ్ళాడుతూ - ఆమె దారపుపోగుతో సంభాషణ మొదలుపెట్టింది. అట్లాగే మంచం పైకి జారి, మూసిన తలుపు సందులోంచి తోసుకొచ్చే గాలి గురించీ, చలి హెచ్చరికల్ని పట్టించుకోని దోమల గురించీ సంభాషణ మొదలుపెట్టాను. నిద్రలోనే ఆమె ఊ కొడుతోంది. మంచంపై నుంచి ఆమె అటు దొర్లగానే సంభాషణ తెగింది. గది మళ్ళీ వంటరిదయింది. బయట చల్లటిగాలి జుమ్‌జుమ్‌మంటూ తలుపుల్ని, కిటికీల్ని బాదుతోంది. పగలంతా నా లోపల గిలగిలలాడిన ఒక దిగులు, రాత్రికి నాతోనే, నా పక్కనే పడుకొని, నేను దాన్నే ప్రేమిస్తూ -

## 17

మళ్ళీ సుందరం గుర్తుకొచ్చాడు. మరింక అతన్ని ఛూడలేనేమో అన్న దిగులు. అతని జ్ఞాపకాలు, రూపురేఖలు పదేపదే మనోచిత్రంపై యాడ్స్‌లా ప్రత్యక్షమయి, ఆరడుగులు, తెల్లని ఛాయ, వెడల్పయిన నుదురు, తీక్షణమైన కళ్ళు, గుబురు గడ్డం, లాల్చీ పైజామా, పైనొక ఖద్దరు జాకెట్టూ - సుందరం రూపం అట్లా వెంటాడుతూనే ఉంది. బహుశా ఈ రాత్రంతా - రేపు మళ్ళీ ఆఫీసులో, ఎప్పటిలా బిజీ బిజీ. బహుశా రేపో, మరునాడో, లేదా ఇంకో వారానికో మరింక రొటీన్‌లో పడిపోతూ, అతన్ని మొత్తంగా మర్చిపోతానేమో -

పత్రికాఫీసులో సుందరం బదులు మరొకడు, బహుశా రెండో సుందరమో, మూడో సుందరమో వచ్చి చేరతాడు. వాడూ సుందరంలా ఒక నియంతలా మారి - అవును సుందరం నియంత. దేన్నీ లక్ష్యపెట్టడు. అతనివి గాఢమైన విశ్వాసాలు, నమ్మకాలు. ఆ మేరకే పత్రిక నడవాలంటాడు. నిజానికి ఈ మూడు వారాల్లో ఆఫీసంతా విముక్తం కాబడ్డట్టుగా కనిపించసాగింది. అంతటా స్వేచ్ఛా వాయువులు. కొత్త శీర్షికలు, కొత్త గెటప్, ఊపిరాడనితనంలోకి ప్రాణవాయువు ప్రసరించినట్టుగా -

వందల వేలసార్లు సుందరం నాతో వాదించి ఉంటాడు. అన్నిసార్లు అతని వాదనా పటిమ ముందు నేను తలవంచేవాణ్ని. కత్తి అంచు పై పాదరసం ప్రయాణిస్తున్నట్లుగా, అతని ఆలోచనాధార స్పష్టంగా, నిరంకుశంగా సాగేది. ఆ క్షణానికి అతను ఒక మోళీ విప్పుతున్న మాంత్రికుడిలా - పూర్తిగా అతనికి సరెండర్ అయిపోతాను.

## 18

ఈ రాత్రి ఒంటరిగా, చలిలో, చీకటిలో సుందరాన్ని జ్ఞాపకం చేసు కొంటుండగా - అతని వాదనలు, తర్కాలు గుట్టలు గుట్టలుగా గది మొత్తం పేరుకుపోయి, బహుశా ఆ మేరకు అవి నన్ను శుద్ధి చేసి ఉంటాయి. సుందరం బలమైన మానవునికి, కొత్త ఆలోచనల మానవునికి ప్రతీక. అతన్ని అంతగా ఇష్టపడలేం. అతను లేకుండా బ్రతకనూలేం. అతన్ని ద్వేషించడంలో చాలా హాయి ఉంటుంది. అయితే రేపు ఈ సుందరాలదే. ఈ విషయం ఒప్పుకోకుండా ఉండటానికి ఎంతగానో ప్రయత్నిస్తుంటాం.

## 19

బహుశా రేపటికింత దిగులు ఉండదు. వాతావరణంలో ఇంత చలీ ఉండదు. గడియారపు పిట్ట అనే అమ్మాయి మళ్ళీ రేపు ఉదయం ఆరుగంటల యాభై నిముషాలకు ప్రత్యక్షం కావచ్చు.

## 20

బహుశా సుందరం ఇక రాడు. అతని అదృశ్యం నిజం కావచ్చు. కానీ అతనెప్పుడూ పక్కనే ఉంటే ఎంత బాగుండునో అనే కోరిక గదిలోనూ, మంచం పైనా, నాలోనూ -

*- ప్రస్థానం సాహిత్య ప్రత్యేక సంచిక, 2002*